- సదర్మాట్ స్థిరీకరణ కోసమే పైన బ్యారేజ్ కట్టినం
- అడ్డం పొడుగు మాట్లాడేవాళ్ల మాటలు నమ్మాల్సిన పని లేదు..
- జాన్సన్ నాయక్‌కు ఓటు వేస్తే.. నాకు ఓటు వేసినట్లే..
- రామారావు దత్తత తీసుకుంటా అన్నంక మీకు ఇంకేం బాధ..
- ఇక్కడున్న ఎమ్మెల్యే మంచిగ లేదు.. మాట్లాడితే లంచాలు తీసుకుంటున్నరు..
- అందుకే నేను పిలిస్తేనే జాన్సన్ వచ్చాడు.. మీకు నిస్వార్థంగా మంచి సేవ చేస్తారు..
- ఖానాపూర్ నియోజకవర్గ 'ప్రజా ఆశీర్వాద సభ'లో ముఖ్యమంత్రి కేసీఆర్

# మరో 20 వేల ఎకరాలకు నీళ్లిస్తాం..



ఖానాపూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్


మంచిర్యాల, నవంబర్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సదర్మాట్ అప్పుడున్న నిజాం సర్కార్ కట్టింది. దాన్ని ఆ రోజు బ్యారేజ్‌లా కట్టలే. మాములుగా ఓ 15 వేల ఎకరాలకు నీళ్లు రావాలని నిర్మించారు. ఇప్పుడు పైన కట్టిన బ్యారేజ్ సదర్మాట్ కోసమే, దాని స్పెషల్ కెనాల్ కూడా మంజూరైంది. పాత 15 వేల ఎకరాలే కాకుండా ఇంకో 20 వేల ఎకరాలకు ఎక్స్‌ట్రా ఆయకట్టు కూడా వస్తది మీకు. అది నా బాధ్యత. నేను చేసి పెడుతా అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద సభ'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాడొకడు, వీడొకడు అడ్డం పొడుగు మాట్లాడితే దాన్ని మీరు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. సదర్మాట్ పైన బ్యారేజ్ కట్టిందే దాని స్థిరీకరణ కోసమని, మీ కోసమని స్పష్టం చేశారు. దాని మీద ఎలాంటి అనుమానాలు అక్కర లేదని, ఆ పని నేను చేయిస్తా. నా జిమ్మేదారి అని సీఎం చెప్పారు. తెలంగాణ వచ్చాకే వ్యవసాయం స్థిరీకరణ జరుగుతుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో నీళ్లకు పన్ను ఉంటుందని, మన రాష్ట్రంలో నీళ్లకు రూపాయి కూడా పన్ను లేదన్నారు. సదర్మాట్ ద్వారా, కడెం ద్వారా మీకు నీళ్లు ఇస్తే నీటి తీరువా లేకుండా చేశామన్నారు. పాత బకాయిలను రద్దు చేశామని, 24 గంటలు మంచి నాణ్యమైన ఉచిత కరెంట్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. గతంలో కరెంట్ బాధలేంది. ఇవాళ కరెంట్ ఏ విధంగా ఉందనేది మీ కండ్ల ముందే ఉందన్నారు. అందుకే జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని, లేకపోతే మనం దెబ్బతినే పరిస్థితి వస్తుందన్నారు.

### జాన్సన్ గెలిస్తే మీకు ఇబ్బంది లేకుండా చూస్తడు..

రైతుబంధు ఉండాలంటే జాన్సన్ నాయక్ గెలవాలి. రైతుబంధు వేస్ట్ అనే కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలవాలా.. రైతుబంధు ఉండాలనే పార్టీ అభ్యర్థి జాన్సన్ గెలవాలా మీరు నిర్ణయం తీసుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. మీరు జాన్సన్‌ను గెలిపించండి.. ఎకరాకు రూ.10 వేలు వచ్చే రైతుబంధును రేపు రూ.16 వేలు చేస్తామన్నారు. 24 గంటల కరెంట్ సప్లయ్ కావాలంటే కూడా జాన్సన్ నాయక్ గెలవాలన్నారు. యుద్ధం నడిచేప్పుడు ఎవడైతే మన కోసం కొట్లాడుతడో వాని చేతికి కత్తి ఇవ్వాలే గానీ, కత్తి ఒకనికి ఇచ్చి యుద్ధం ఇంకొకరిని చేయమంటే చేయస్తదా.. చేయగలుగుతమా.. మీరే ఆలోచించాలన్నారు. మీరు కత్తి జాన్సన్‌నాయక్ చేతుల పెట్టండి రూ.16 వేల రైతుబంధు తెస్తడు. 24 గంటల కరెంట్ ఉంచుతడు. మీకు ఇబ్బంది లేకుండా చూస్తడు అని కేసీఆర్ హామీ ఇచ్చారు. రెండు, మూడు సమస్యలు జాన్సన్ నాయక్ నా దృష్టికి తీసుకొచ్చాడని ఖానాపూర్‌కు డిగ్రీ కాలేజీ కావాలన్నరు. మాకు రెవెన్యూ డివిజన్ కావాలన్నడు ఈ రెండు కూడా న్యాయమైన విషయాలే అన్నారు. ఇది అడవి ప్రాంతం, వెనుకబడిన ప్రాంతం కాబట్టి తప్పకుండా అభివృద్ధి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఖానాపూర్, నిర్మల్ వాటి చుట్టూ పక్కల ఉన్న ఐదారు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ గవర్నమెంట్ పుణ్యమా అని మన బిడ్డలు చాలా మంది గల్ఫ్‌కు పోయి బతుకుతున్నరని సీఎం కేసీఆర్ అన్నారు. మా గురించి కూడా ఆలోచించమని చాలా రోజుల నుంచి కోరుతున్నారని, తప్పకుండా ఈ గల్ఫ్‌కు పోయినోళ్ల బాధలేంది. ఈ సారి ఆలోచించి వాళ్లకు పూర్తి సాయం చేయడానికి ప్రత్యేక కార్యక్రమం తీసుకుంటామన్నారు.

### జాన్సన్ నా కొడుకు రామ్ క్లాస్‌మేట్.. మీకు ఏం కావాలన్నా నిమిషాల్లో చేస్తాం..

జాన్సన్ నాయక్ గురించి మీకు ఎంత మందికి తెలుసో నాకు తెలియదు. కానీ ఈయన నా కొడుకు రామ్ క్లాస్‌మేట్ అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. మొన్న రామ్ ఇక్కడికి వచ్చినప్పుడు ఖానాపూర్‌ను నేను దత్తత తీసుకుంటా అని చెప్పినట్లు తెలిసిందన్నారు. ఇగ, రామారావు దత్తత తీసుకున్నంక మీకు ఏం తక్కువైతది.. మీకు ఏం బాధ లేదన్నారు. మీరు జాన్సన్ నాయక్‌కు ఓటు వేస్తే నాకు ఓటు వేసినట్లే లెక్క అన్నారు. మంచి మెజార్టీతో జాన్సన్ నాయక్‌ను గెలిపియాలని చెప్పారు. జాన్సన్ డబ్బుల కోసం రాజకీయాల్లోకి రాలేదని, దేవుడు ఆయనకు చాలా డబ్బులు ఇచ్చారని, అమెరికాలోనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉందన్నారు. నీ లాంటి యువకులు, చదువుకున్నోళ్లు రావాలే రాజకీయాలకు ఇక్కడున్న ఎమ్మెల్యే సక్కగ లేదు అంత పిచ్చిపిచ్చి యవ్వారం ఉంది, మాట్లాడితే వాళ్లు లంచాలు తీసుకుంటున్నరని చాలా కంప్లెంట్ వస్తున్నయ్, అందుకే చదువుకున్నోళ్లు నీలాంటి బుద్ధిమంతులు వస్తే లాభం జరుగుతుందని నేను పిలిస్తే ఆయన వచ్చారన్నారు. ఆయనంతట ఆయన టికెట్ అడగలేదని, నేను పిలిస్తే రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి మీకు నిస్వార్థంగా మంచి సేవ జరుగుతుందన్నారు. కేటీఆర్ దత్తత తీసుకుంటే నేను తీసుకున్నట్లే కదా.. మీకు ఏం కావాలో అన్ని కూడా నిమిషాల మీద జరుగుతాయని, దానికి అనుమానం అవసరం లేదని చెప్పారు. ఒక రోజు నేనే స్వయంగా రాష్ట్ర అధికారులందరినీ తీసుకొని క్యాంప్‌కు వస్తానని, దినమంతా ఖానాపూర్‌లో ఉండి ఏం పనులు అవసరం ఉన్నయో నోట్ చేసి అవన్నీ చేపిస్తానని హామీ ఇచ్చారు. యువకుడు, బుద్ధిమంతుడు, నాలెడ్జ్ ఉన్నోడు, దేశవిదేశాలు తిరిగిన వ్యక్తి, అవగాహన ఉన్నోడు, నా కుటుంబానికి దగ్గరున్నోడు గెలిస్తే మీకు లాభం జరుగుతదని చెప్పారు. మంచి మెజార్టీతో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తా ఉంది. కాంగ్రెస్ అంతా మటాష్. ఒట్టిదే గ్యాస్.. ఏం లేదు అంత ఒట్టిదే బొబ్బ తప్ప ఏం లేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, మధుసూదనాచారి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, నిర్మల్, ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్లు విజయలక్ష్మి, జనార్దన్ రాథోడ్, సీనియర్ నాయకులు పైడిపల్లి రవీందర్‌రావు, పూర్ణచంద్రనాయక్, అంకం రాజేందర్, భూక్యా జానకీబాయ్, చారులత రాథోడ్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# తుది శ్వాస వరకు ఖానాపూర్‌కు సేవ చేస్తా

- ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్

కడెం, నవంబర్ 26 : ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను ప్రజలు ఆదరించాలని, నా తుది శ్వాస వరకు ఖానాపూర్‌కే నా జీవితం అంకితం చేస్తానని భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఆదివారం నిర్వహించిన ముఖ్యమంత్రి ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గడిచిన పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. తండాలను, గూడేలను పంచాయతీలుగా తీర్చిదిద్ది స్వయం పాలన అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు, గిరిజన, ఆదివాసీ గూడేల అభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని, అలాగే ఇటీవల ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 25 కోట్లను ఇచ్చి సహకరించిన ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు, ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. కవ్వాల్ టైగర్‌జోన్ వల్ల ఇక్కడి అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, ఆ ఆంక్షలను ఎత్తివేయాలని, రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని కోరారు. అలాగే కడెం ప్రాజెక్టు రీడిజైన్ చేసి, శాశ్వత పరిష్కారం చూపించాలని, వానకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించాలని కోరారు. అలాగే కడెం మండలంలోని గంగాపూర్ వంతెనతో పాటు రోడ్డు నిర్మాణం, సిరిచెల్మ రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

# బీఆర్ఎస్‌లో చేరిన ధర్మారం సర్పంచ్

జన్నారం, నవంబర్ 26 : జన్నారం మండలంలోని ధర్మారం సర్పంచ్ దుర్గం గంగాధర్ ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. దుర్గం గంగాధర్‌కు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యాదగిరి శేఖర్‌రావు మాట్లాడారు. నెల రోజులుగా స్వగ్రామమైన కలమడుగులో ఉంటూ బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ గెలుపే లక్ష్యంగా అన్ని గ్రామాల్లో తిరుగుతూ ప్రజలు, మిత్రులు, ప్రైవేట్ ఉపాధ్యాయులను, పాఠశాలల యాజమాన్యలను కలిసి కారు గుర్తుకే ఓట్లు వేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.


బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ సమక్షంలో పార్టీలో చేరుతున్న ధర్మారం సర్పంచ్ గంగాధర్

# నేడు చెన్నూర్‌కు మంత్రి కేటీఆర్ రాక

చెన్నూర్, నవంబర్ 26 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సోమవారం చెన్నూర్ పర్యటనకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌కు మద్దతుగా పట్టణంలో నిర్వహిస్తున్న రోడ్‌షోలో ఆయన పాల్గొంటారు. అనంతరం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా వద్ద రోడ్‌షోలో ఆయన ప్రసంగిస్తారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా చెన్నూర్‌కు చేరుకుంటారు. కావున బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677